తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం
4 అక్టోబర్ 2026
పేజీలు : 08
Follow :




# వికారాబాద్ గడ్డ ప్రమాదాల అడ్డా

## ప్రయాణికులను మింగేస్తున్న మూల మలుపులు

## ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్లు

- రోడ్డుపైకి వస్తే ఇంటికి క్షేమంగా వెళ్తామన్న గ్యారంటీ లేదు
- జిల్లాలో రోజురోజుకు తిరిగి పోతున్న రోడ్డు ప్రమాదాలు
- అనంత వాయువులో కలిసిపోతున్న అమాయకుల ప్రాణాలు
- లోపాలను గుర్తించని అధికారులు
- ఇకనైనా ప్రమాదాలు ఆగేనా...





**వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 3 (జనం సాక్షి)**

పొద్దు పోయిందంటే చాలు... పోలీసోళ్ళు గొట్టాలు పట్టుకొని రోడ్ పైకి వచ్చి దారిన పోయే వాహనదారులందరినీ ఊపిరి ఊదమంటారు.. కానీ రోడ్డుపైకి వస్తే చాలు గొట్టాల్లో ఊపిరి ఊద కుండానే వాళ్ల ఊపిరి ఆగిపోతుంది. ఇది డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగిందా అంటే కాదు అని చెప్పవచ్చు.. కానీ ఈ ప్రమాదాలు ఎవరి తప్పిదం వలన జరుగుతుందని విషయాన్ని ఇప్పటికీ అధికారులు గుర్తించలేకపోయారు. ఫలితంగా వికారాబాద్ గడ్డ ప్రమాదాలకు అడ్డగా మారిపోయింది. బీజాపూర్ హైవే ప్రమాదాలకు నిలయంగా మారిందని అందరికీ తెలుసు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఈ రోడ్డు శాపంగా మారింది. తరచు ఈ హైవేపై ప్రమాదాలు జరిగి ఎందరో అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసి పోయి వారి కుటుంబాలు వీధనపడుతున్నాయి.

## 265 ఆక్రమణలు తొలగింపు..

# 14.47 కి.మీ. వాక్-ఫ్రీ

- మూడు జోన్లలో విస్తృతంగా ఆక్రమణల తొలగింపు
- శేరిలింగంపల్లి జోన్‌లో 97 ఆక్రమణలు క్లియర్
- కుత్బుల్లాపూర్‌లో 92, కూకట్‌పల్లిలో 76 తొలగింపు
- పాద‌చారుల సౌకర్యమే లక్ష్యంగా నిరంతర పర్యవేక్షణ




మిగితా 2లో

# హైదరాబాద్ దిశా కమిటీ సమావేశంలో అభివృద్ధి పనులపై సమీక్ష

- హాజరైన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, దిశా కమిటీ చైర్‌పర్సన్ జి.కిషన్ రెడ్డి



హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 03 (జనం సాక్షి) : హైదరాబాద్ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశా) కమిటీ సమావేశం తార్నాకలోని సీఎస్ఐఆర్–ఐఐసీటీ సమావేశ మందిరంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, దిశా కమిటీ చైర్‌పర్సన్ జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.నగర అభివృద్ధి, మౌలిక వసతులు, కేంద్ర సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహిం చారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్, తాగునీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కిషన్ రెడ్డి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకా లు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. హైదరాబాద్‌ను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ముందంజలో నిలపాలని, కేంద్రం నుంచి అవసరమైన నిధులు తీసుకురావడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఫతేనగర్–సనత్‌నగర్ రైల్వే వంతెన విస్తరణ లేదా పునర్నిర్మాణంపై ముఖ్యమంత్రికి లేఖ రాయనున్నట్లు, సనత్‌నగర్ ఆర్.యూ.బీ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. రాణి గంజ్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రైల్వే డీఆర్ఎం, జీహెచ్ఎంసీ కమిషనర్, ట్రాఫిక్ అధికా రులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. రాణిగంజ్ ఆర్ఓబీ విస్తరణ, రైల్వే స్థలా ల్లో ప్యాసేజ్ రోడ్లు, డ్రైనేజీ పనులపైనా సమీక్షించా రు. పేదల ఇళ్ల నిర్మాణంలో ప్రతి నియోజకవర్గానికి 480 ఇళ్ల చొప్పున స్థలాలు కేటాయించినట్లు అధికారులు వివరించారు. ప్రభుత్వ భూములు, పార్కు ల ఆక్రమణలపై తక్షణ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై భారం తగ్గించేందుకు ఆధునిక వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్లను వేగవంతం చేయాల ని, బోలక్‌పూర్‌లోని కాలుష్యకారక పరిశ్రమలను ఔటర్‌కు తరలించాలని సూచించారు. నగరంలో ఈ–వేస్ట్ రీసైక్లింగ్, స్టార్మ్‌వాటర్ డ్రైనేజీ, 39 ఎస్టీపీల పనులు, మహిళా ఎస్.హెచ్.జీలను 20 లక్షల సభ్యులకు పెంచడం, రూ.20 లక్షల వరకు రుణాల కల్పన, పీఎం స్వనిధి–ముద్రా రుణాలపై ఫీడ్‌బ్యాక్ కార్యక్రమాలపై సమీక్షించారు. తాగునీటి సరఫరా, విద్యుత్ బకాయిలు, ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద షెల్టర్ హోమ్స్, నిరుపయోగంగా ఉన్న విద్య–వైద్య భవనాల వినియోగం, మత్స్యకార సంక్షేమం, హుస్సేన్‌సాగర్ శుద్ధి, రేషన్ బియ్యం సరఫరాపైనా చర్చించారు. ఈ సమావేశంలో మహిళా సేఫ్టీ వింగ్ డీసీపీ డాక్టర్ లావణ్య, డీఆర్వో డాక్టర్ నారాయణ, సీపీఓ డాక్టర్ సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, సంక్షేమ అధికారు లు జి. ఆశన్న, ప్రవీణ్ కుమార్, ఇలియాస్ అహ్మద్, సదానందంతో పాటు వివిధ శాఖల జిల్లా అధికా రులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌తో ప్రజా రవాణా మరింత సులభం

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్

హైదరాబాద్ : నగరంలో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసేందుకు ఆర్టీసీ–మెట్రో కామన్ పాస్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చే కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాభవన్ నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎమ్మెల్యే గణేష్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తదితరులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. అనంతరం బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి మెట్రో రైలులో ప్రయాణించి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ మెట్రో స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి తిరిగి ఆర్టీసీ బస్సులో సెక్రటేరియట్‌కు వెళ్లారు. ఆర్టీసీ బస్సు, మెట్రో రైలుకు ఒకే కామన్ పాస్‌తో ప్రయాణించే సౌకర్యం అందుబాటులోకి రావడంతో నగర ప్రజలకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారుతుందని నాయకులు పేర్కొన్నారు. ప్రజా రవాణా వ్యవస్థల అనుసంధానంతో ప్రయాణికులకు సమయం, ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు.

# భూసేకరణ అవకతవకలపై మండిపడ్డ రైతులు

- యాచారంలో ఆర్టీసీ రోడ్డుపై బైఠాయింపు, స్తంభించిన రాకపోకలు



**యాచారం, అక్టోబర్ 3(జనం సాక్షి ) :** యాచారం యాచారం మండలం మొండి గౌరెల్లి గ్రామంలో ఇటీవల చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బాధిత రైతులు శనివారం తీవ్ర ఆందోళనకు దిగారు. గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 19, 68, మరియు 127 ల పరిధిలోని భూముల సేకరణలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని, రికార్డుల నమోదులో అక్రమాలకు పాల్పడ్డారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన బాధిత రైతులు, అధికారుల నుండి స్పష్టమైన హామీ రాకపోవడంతో ఆందోళనను తీవ్రతరం చేశారు. అనంతరం నాగార్జునసాగర్ – హైదరాబాద్ ప్రధాన రహదారిపై కుటుంబసమేతంగా బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు మాట్లాడుతూ... సర్వే నంబర్లు 19, 68, 127 పరిధిలో తరతరాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములకు సంబంధించి సరైన పరిహారం చెల్లించకుండా, నోటీసులు లేకుండా ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. స్థానిక ఆర్డీవో (=ఐా), జిల్లా కలెక్టర్ స్వయంగా ఘటనా స్థలానికి వచ్చి తమ సమస్యపై స్పష్టమైన సమాధానం చెప్పే వరకు రహదారిని వదిలిపెట్టేది లేదని భీష్మించుకూర్చున్నారు. రైతుల రాస్తారోకో కారణంతో నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అధికార యంత్రాంగం స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

# పాఠశాల పరిసరాల్లో అక్రమ పార్కింగ్‌పై చర్యలకు కమిషనర్ ఆదేశాలు

- విద్యార్థులు, తల్లిదండ్రులకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేలా చర్యలు



**ఉప్పల్, అక్టోబర్ 3 (జనం సాక్షి):** హబ్సిగూడ వార్డు పరిధిలోని రవీంద్రనగర్‌లో ఉన్న సెయింట్ జోసెఫ్ పాఠశాల పరిసరాల్లో అనధికార పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్ అక్కడ నెలకొన్న పరిస్థితులను పరిశీలించి, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పాఠశాల ఆవరణ సమీపంలో రహదారులకు అడ్డంగా, రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా పార్క్ చేసిన వాహనాలను గుర్తించాలని ఆదేశించారు. అనధికారికంగా పార్క్ చేసిన వాహనాల కారణంగా పాఠశాల సమీపంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన చోట వాటిని తొలగించడం లేదా టోయింగ్ చేయడం చేపట్టాలని సూచించారు. ఈ విషయంలో పట్టణ ప్రణాళిక విభాగం, ట్రాఫిక్ పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ముఖ్యంగా పాఠశాల ప్రారంభం, ముగింపు సమయాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించే నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల గేట్ల వద్ద వాహనాల రద్దీ ఏర్పడకుండా చూడడంతో పాటు, పాదచారులు సురక్షితంగా నడిచేందుకు మార్గాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పాదచారుల మార్గాలకు అడ్డుగా ఉన్న వాహనాలు, ఇతర అవరోధాలను గుర్తించి తొలగించాలని, పాఠశాల పరిసరాల్లో ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన, సులభంగా చేరుకోగలిగే వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు. పాఠశాల పరిసరాల్లో ట్రాఫిక్ నిర్వహణతో పాటు పార్కింగ్ నియంత్రణపై కూడా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ పాఠశాల పరిసరాల్లో రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని, సమస్యలు గుర్తించిన వెంటనే సంబంధిత విభాగాల సమన్వయంతో పరిష్కరించాలని కమిషనర్ అధికారులకు స్పష్టం చేశారు. పాఠశాల పరిసరాలను సురక్షితంగా, పరిశుభ్రంగా ఉంచేందుకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో చర్యలు కొనసాగించాలని ఆదేశించారు.

## గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదును విస్తృతం చేయాలి: తలసాని



**అమీర్‌పేట్, అక్టోబర్ 3 (జనం సాక్షి):** త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ డివిజన్లలో నాయకులు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించాలని సూచించారు. అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ఓటరు నమోదు దరఖాస్తులు అందజేసి వివరాలు సేకరించాలని అన్నారు. గత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారు కూడా తిరిగి తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సిన విషయాన్ని వివరించాలని సూచించారు.గత ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో సుమారు 10 వేల మంది గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయించినట్లు తెలిపారు. ఈసారి 40 వేల మంది గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు నామన శేషుకుమారి, అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, శ్రీహరి, గందె నాగులు, ప్రవీణ్ రెడ్డి, అశోక్ యాదవ్, నామన సంతోష్ కుమార్, కరుణాకర్ రెడ్డి, లక్ష్మీపతి, మహేందర్ గౌడ్, ప్రేమ్, గుడిగే శ్రీనివాస్ యాదవ్, రామ్ నివాస్ బన్సాల్, శేఖర్, వెంకటరమణ, శ్రీకాంత్ రెడ్డి, కూతురు నర్సింహ, కట్టా బలరాం, బాసా లక్ష్మీ, దుర్గ, నాగలక్ష్మీ, అనిత రెడ్డి, సీమా తదితరులు పాల్గొన్నారు.



## కల్లెం నవజీవన్ రెడ్డికి ప్రత్యేక గుర్తింపు పురస్కారం

**హయత్‌నగర్, అక్టోబర్ 3 (జనం సాక్షి)** హైకోర్టు కాలనీ డివిజన్‌లోని హుడా సాయి నగర్‌లో 'బ్రీత్ ఆఫ్ లైఫ్ యోగా' ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి, ఆయన సతీమణి కల్లెం నవీన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్లెం నవజీవన్ రెడ్డిని నిర్వాహకులు ఘనంగా సత్కరించి 'స్పెషల్ రికగ్నిషన్ అవార్డు'ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఎంతో అవసరమని అన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.తనకు ప్రత్యేక గుర్తింపు పురస్కారం అందజేసి సత్కరించిన 'బ్రీత్ ఆఫ్ లైఫ్ యోగా' నిర్వాహకులకు కల్లెం నవజీవన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా నిర్వాహకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## 265 ఆక్రమణలు తొలగింపు.. 14.47 కి.మీ. వాక్-ఫ్రీ

**శేరిలింగంపల్లి, అక్టోబరు 3 (జనం సాక్షి):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో శనివారం నిర్వహించిన వాక్-ఫ్రీ డ్రైవ్‌లో భారీగా రోడ్డు ఆక్రమణలను తొలగించారు. మూడు జోన్ల పరిధిలో గుర్తించిన రహదారులపై మొత్తం 265 ఆక్రమణలను తొలగించి 14.47 కిలోమీటర్ల మేర రహదారులను పాదచారులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. రోడ్లపై అక్రమ ఆక్రమణలను తొలగించడం ద్వారా పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయడం, రహదారుల వినియోగాన్ని మెరుగుపరచడం డ్రైవ్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. శేరిలింగంపల్లి జోన్‌లో 97 ఆక్రమణలను తొలగించి 6.57 కిలోమీటర్ల రహదారిని వాక్-ఫ్రీగా మార్చారు. నార్సింగి 16, అమీన్‌పూర్ 8, పటాన్‌చెరు 26, మియాపూర్ 15, శేరిలింగంపల్లి 32 ఆక్రమణలను తొలగించారు. కూకట్‌పల్లి జోన్‌లో 76 ఆక్రమణలను తొలగించి 2.80 కిలోమీటర్ల మేర రహదారిని ఆక్రమణల నుంచి విముక్తం చేశారు. మూసాపేట్ 30, కూకట్‌పల్లి 12, మాదాపూర్ 20, ఆల్విన్‌కాలనీ 14 ఆక్రమణలను తొలగించారు. కుత్బుల్లాపూర్ జోన్‌లో 92 ఆక్రమణలను తొలగించి 5.10 కిలోమీటర్ల మేర రహదారిని వాక్-ఫ్రీగా మార్చారు. కొంపల్లి 7, మేడ్చల్ 7, చింతల్ 16, గాజులరామారం 22, జీడిమెట్ల 14, నిజాంపేట్ 14, దుండిగల్ 12 ఆక్రమణలను తొలగించినట్లు అధికారులు వివరించారు. పాదచారుల నడక మార్గాలకు, ప్రజల రాకపోకలకు అడ్డంకిగా ఉన్న ఆక్రమణలను నిరంతరం గుర్తించి తొలగిస్తామని, ఇప్పటికే క్లియర్ చేసిన ప్రాంతాల్లో తిరిగి ఆక్రమణలు ఏర్పడకుండా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ప్రజా స్థలాలను ఎలాంటి అడ్డంకులు లేకుండా వినియోగించుకునేలా వాక్-ఫ్రీ డ్రైవ్‌ను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## వికారాబాద్ గడ్డ ప్రమాదాల అడ్డా..!!

ఈ హైవేపై వాహనాల రద్దీ అధికంగా ఉండి రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడం వలన తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. కానీ వికారాబాద్ జిల్లా వరకు వస్తే మన్నెగూడ నుంచి వికారాబాద్ మీదుగా తాండూర్ వరకు కొడంగల్ నుంచి చించోలి బార్డర్ వరకు తాండూరు నుంచి సదాశీపేట వరకు మర్పల్లి నుంచి శంకరపల్లి వరకు బుదేరా నుంచి బంటారం వరకు కవేలి చౌరస్తా నుంచి తాండూరు వరకు తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలన్నీ వాహనదారులు తాగి నడపడం వల్ల జరిగినవి కావు. జిల్లా కేంద్రం నుంచి సరిహద్దు గ్రామాల వరకు సైతం పంచాయతీ రాజ్ రోడ్లు భవనాల శాఖ పరిధిలో ఉన్న రోడ్లన్నీ అధ్వాన స్థితికి చేరుకున్నాయి. భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాల వరకు రోడ్లపై వాహనాలు నడపలేని దుస్థితి నెలకొంది. రాత్రి పగలు అనక తరచు ప్రమాదాలు జరిగి అనేకమంది గ్రామీణ పట్టణ ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వీటికి తోడు మూలమలుపులు మూలమలుపుల దగ్గర సూచిక బోర్డు లేని కారణంగా వాహనదారులు సకాలంలో ప్రమాదాన్ని గుర్తించలేక పోవడం వల్ల అనర్థాలు జరిగిపోతున్నాయి. అంతేకాకుండా పట్టణాల నుంచి పల్లెల వరకు రోడ్లకు ఇరువైపులా దట్టమైన గడ్డి పొదలు చెట్లు మొలకెత్తడంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలకు నిలయంగా మారింది. పంచాయతీ రాజ్ రోడ్లు భవనాల శాఖ అధికారులు వీటిని తొలగించిన పాపానికి పోలేదు. అంతేకాకుండా ఎన్నో ఏళ్లుగా వర్షాలకు కొట్టుకపోయిన కలవట్లు రోడ్లు మూల మలుపు వంతెనలు తెగిన వాటిని మరమ్మత్తు చేసిన నాధుడే లేడు. మరి కొన్ని చోట్ల బ్రిడ్జిలు కల్వట్లు నిర్మాణం చేసి రోడ్డు వేయకుండా కాంట్రాక్టర్లు గాలికి వదిలేసారు. జిల్లాలోని రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరిగి భారీ నష్టం వాటిల్లుతుంది. ఈ విషయాలన్నీ సంబంధిత అధికారులకు ప్రజాప్రతినిధులకు తెలియదా అంటే తెలుసు... కానీ ప్రజా రవాణాపై వారు దృష్టి సారించని కారణంగా ఎన్నో కుటుంబాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. దీనికి బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తే అధికారుల నుంచి ప్రజా ప్రతినిధుల నుంచి జవాబు ఉండదు. అప్పులు తప్ప అభివృద్ధికి నిధులు ఎక్కడివని ప్రజా ప్రతినిధులు దాటవేస్తే చేసిన పనికి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేని స్థితిలో తమ శాఖలు ఉన్నాయని సంబంధిత అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఫలితంగా ఇంతటి దారుణ సంఘటనలను చూసి ప్రజలు చలించి పోతున్నారు.

## ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ కమిటీల నియామకం

**ఏ, బీ బ్లాకులతో పాటు డివిజన్లకు నూతన అధ్యక్షుల ఎంపిక**

ఉప్పల్, అక్టోబర్ 3 (జనం సాక్షి): ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్‌కు సంబంధించి నూతన కమిటీల నియామకం జరిగింది. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు కావలి చంద్రయ్య సమక్షంలో, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నియామక కార్యక్రమం నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా లింగంపల్లి రామకృష్ణను నియమించారు. ఏ బ్లాక్ అధ్యక్షుడిగా చింతల బాబు రావు, బీ బ్లాక్ అధ్యక్షుడిగా పాలేటి గౌరి సుదర్శన్‌ను నియమించారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్లకు ఎస్సీ సెల్ అధ్యక్షులను ఎంపిక చేశారు. రామంతాపూర్ డివిజన్‌కు కశ్శాల్ల శంకర్, హబ్సిగూడ డివిజన్‌కు సీహెచ్ లక్ష్మీనారాయణ, ఉప్పల్ డివిజన్‌కు శీలం వెంకటేష్ (నవీన్), నాచారం డివిజన్‌కు ఏర్పుల సుజాతను అధ్యక్షులుగా నియమించారు. హెచ్ఎంటీ నగర్ డివిజన్‌కు చిలక నరేష్, చిలకనగర్ డివిజన్‌కు పాలేటి డేవిడ్, వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌కు ముత్యాల నరేష్, బీరప్పగడ్డ డివిజన్‌కు తూర్పాటి జంగయ్యను డివిజన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహిస్తూ ఎస్సీ వర్గాల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావడంలో నూతన కమిటీలు కీలకంగా పనిచేయాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎంపిక



**హయత్‌నగర్, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్ విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అంతర్ కళాశాల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి పలువురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం కళాశాలకు గర్వకారణంగా నిలిచింది. శనివారం ఉస్మానియా విశ్వవిద్యాలయం సింథటిక్ ట్రాక్‌లో నిర్వహించిన అంతర్ కళాశాల క్రాస్ కంట్రీ టోర్నమెంట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. బీఎస్సీ (ఎంపీసీ) ప్రథమ సంవత్సరం విద్యార్థి డి. సంతోష్ కుమార్ ప్రథమ స్థానం, బీఏ తృతీయ సంవత్సరం విద్యార్థి ఎన్. ధోని తృతీయ స్థానం సాధించారు. వీరిద్దరూ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక య్యారు. ఈ పోటీలు నవంబర్ 11న కర్ణాటకలోని మంగళూ రు విశ్వవిద్యాలయంలో జరగనున్నాయి. అదేవిధంగా డి. సంతోష్ కుమా ర్ 41వ జూనియర్ నేషనల్స్ పోటీలకు కూడా ఎంపికయ్యారు. అక్టోబర్ 23 నుంచి 27 వరకు చెన్నైలో జరిగే ఈ పోటీల్లో అండర్-18 విభాగంలో 1000 మీటర్ల పరుగు పోటీలో ఆయన పాల్గొననున్నారు. బీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థి కె. ఉదయ్ కిరణ్ జూనియర్ నేషనల్స్ లాంగ్ జంప్ విభాగానికి ఎంపికయ్యారు. వరంగల్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి మీట్‌లో ఆయన ప్రథమ స్థానం సాధించారు. బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి గణేష్ జూనియర్ నేషనల్స్‌కు ఎంపికయ్యారు. చెన్నైలో జరిగే పోటీల్లో 200 మీటర్ల రిలే విభాగంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సురేష్ బాబు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల కృషి, పట్టుదల, ప్రతిభను ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా. కె. అనిత విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, క్రీడాకారుల కృషిని అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు వరుసగా ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ డా. సురేష్ బాబు పేర్కొన్నారు.

# మారిన దేవనూర్... మార్చిన నాయకురాలు

- **ఎల్ఈడి వెలుగుల్లో దేవనూర్ ప్రజల గుండెల్లో రేణుకా దేవి**
- **ఇది మనం చూడని దేవనూర్ కాదు.. మనం చూస్తున్న నవ దేవనూర్**
- **సర్పంచ్ రేణుకా దేవి కిషన్ రావు మార్క్ పాలన**



ఒకప్పుడు దేవనూర్ అంటే... సాయంత్రం 6 దాటితే చీకటి. వీధి మలుపులో 10 రూపాయల చిన్న బల్బు వెలుగుతుందో లేదో అనే పరిస్థితి. నీటి కోసం బిందె పట్టుకుని వీధుల్లో తిరిగే ఆడబిడ్డలు. 40-50 ఏళ్లుగా ఇదే కథ. పాలకులు మారారు, హామీలు మారాయి కానీ గ్రామం మారలేదు. గత సర్పంచ్ ఎన్నికల్లో గ్రామ ప్రజలు రేణుకా దేవి కిషన్ రావు అవకాశం కల్పించారు. ఇంతకుముందు మనం చూసిన దేవనూర్ కి, ఇప్పుడు మనం చూస్తున్న దేవనూర్ కి ఎంత తేడా ఉందో ఒక్కసారి గమనించండి. నిజంగా ఇది అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనం. యాలాల మండలం దేవనూర్ గ్రామంలో ఊహ తెలిసినప్పటి నుంచి, అంతకుముందు 40-50 సంవత్సరాల నుంచి గత పాలకులు ఎన్నడూ చేయని అభివృద్ధి, గత 9 నెలల్లోనే జరిగిందంటే అతిశయోక్తి కాదు. ఒకప్పుడు 10 రూపాయల బుగ్గ (బల్బు) తో సరిపెట్టిన రోజులు చూశాం. చీకటిలోనే గ్రామం మగ్గిపోయేది. దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకా దేవి కిషన్ రావు అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ రూపురేఖలే మార్చేశారు. పెద్ద పెద్ద 50 వాట్స్ ఎల్ ఈడి వీధి లైట్లతో గ్రామాన్ని పట్టపగలుగా మార్చిన ఘనత సర్పంచ్ రేణుకా దేవి కే సోంతం. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం. గెలిచిన వెంటనే ప్రతి వాడలో ఉన్న మూతపడిన బోర్లను రిపేర్ చేయించి, గ్రామ ప్రజలకు తాగునీటిని అందుబాటులోకి తెచ్చారు. డ్వాక్రా భవనాన్ని అందుబాటులోకి తెచ్చి మహిళలకు అండగా నిలిచారు.

నేరాలు అరికట్టేందుకు గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అన్ని పండుగలను సర్పంచ్ ముందుండి జరిపిస్తూ గ్రామంలో ఐక్యతను చాటుతున్నారు. 9 నెలల సమయంలోనే ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసిన సర్పంచ్ రేణుకా దేవి కిషన్ రావు, ఇంకా ముందు ముందు మరింత అభివృద్ధి చేస్తారనడంలో సందేహం లేదు. సర్పంచ్ ఆధ్వర్యంలో దేవనూర్ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతిఒక్కరు కలిసి సహకరించాలి.

## పెడల్ పై పేదింటి ప్రతిభ - నిజామాబాద్‌లో మెరిసిన తాండూరు బాలికలు

- **రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన పుత్రికలు - నారీ శక్తికి నిదర్శనం.**
- **సైకిల్ పై సంచలనం - అస్మితా ఖేలో ఇండియాలో తాండూరు కేజీబీవీ విద్యార్థినుల పతకాల పంట.**



**తాండూరు అక్టోబర్ 3(జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గత నెల 27, 28 తేదీలలో జరిగిన అస్మితా ఖేలో ఇండియా ఉమెన్స్ 10 కిలోమీటర్ల రోడ్డు సైక్లింగ్ పోటీలలో వికారాబాద్ జిల్లా తాండూరు కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు పాల్గొని నారీ శక్తిని చాటారు. ఈ పోటీలలో మెడల్స్ సాధించిన ఆర్. శ్రావణి, కాజల్, సిహెచ్. నందిని బాయి, పీఈటీ బాలమణిలతో పాటు రాష్ట్ర స్థాయిలో పాల్గొన్న బాలికలు పల్లవి, నందిని, అక్షర, నిహారికలను ఈ నెల 3న పాఠశాలలో ఘనంగా సన్మానించారు. పాఠశాల ఎస్ఓ ఆశాలత అధ్యక్షతన జరిగిన అభినందన సభలో ముఖ్య అతిథిగా నారాయణపేట జిల్లా సైక్లింగ్ ప్రధాన కార్యదర్శి బి. గోపాలం హాజరై మెడల్స్ సాధించిన సైకిల్ రైడర్స్ కు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా బి. గోపాలం మాట్లాడుతూ... "మీరందరూ చాలా పేద విద్యార్థినులు. మీ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, బాగా కష్టపడి చదివి, క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. సైక్లింగ్ సర్టిఫికెట్స్ చదువుల కొరకు, ఉద్యోగాల కొరకు స్పోర్ట్స్ కోటాలో ఉపయోగపడతాయి" అని తెలిపారు. ఎస్ఓ ఆశాలత మాట్లాడుతూ... "రాష్ట్రస్థాయిలో మెడల్స్ సాధించిన శ్రావణి, కాజల్, సిహెచ్. నందిని, పీఈటీ బాలమణి వలన పాఠశాల కీర్తి ప్రతిష్టలు పెరిగాయి" అని సంతోషాన్ని వ్యక్తపరుస్తూ, క్రీడలకు సహకారం అందిస్తున్న గోపాలంను ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు సవిత, హేమలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఏఏఎల్డిఐ కార్యదర్శిగా డా.రవికుమార్



**రాజేంద్రనగర్,అక్టోబర్3(జనంసాక్షి):** అసోసియేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ లైబ్రేరియన్స్ అండ్ డాక్యుమెంటలిస్ట్స్ ఆఫ్ ఇండియా (ఏఏఎల్డిఐ) 2026-2028 కాలానికి నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఇందులో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం గ్రంథపాలకుడు డా.ఎన్.పి రవి కుమార్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. గతంలో 2019--2021 కాలంలో కోశాధికారిగా సేవలందించారు. 1971లో స్థాపించబడిన ఏఏఎల్డిఐ వ్యవసాయ గ్రంథాలయాధికారులు, డాక్యుమెంటలిస్టులు, సమాచార నిపుణుల వృత్తిపరమైన అభివృద్ధికి కృషి చేస్తోంది. నూతన కార్యవర్గం జ్ఞాన మార్పిడి, పరస్పర సహకారం, డిజిటల్ సమాచార సేవలు, వ్యవసాయ గ్రంథాలయ సేవల బలోపేతానికి కృషి చేయనుందని డా. రవికుమార్ తెలిపారు. ఆయన ఎన్నికపై విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, బంధువులు, మిత్రులు అభినందనలు తెలిపారు.



## కిష్టయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం
- అందించిన పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్

**హయత్ నగర్, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** బీబీనగర్-ఘట్‌కేసర్ మధ్య కొండమడుగు సమీపంలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో జూలూరు అలీనగర్‌కు చెందిన గొర్రెల కాపరి కిష్టయ్యకు చెందిన సుమారు 500 గొర్రెలు మృత్యువాత పడిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంతో గొర్రెలే జీవనాధారంగా బతుకుతున్న కిష్టయ్య కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడింది. విషయం తెలుసుకున్న యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోచబోయిన సురేష్ యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, రైలు ప్రమాదంలో మృత్యువాత పడిన సుమారు 500 గొర్రెలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరారు. గొర్రెల మృతితో జీవనోపాధి కోల్పోయిన కిష్టయ్య కుటుంబానికి ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయం అందించి, తిరిగి జీవనోపాధి పొందేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు స్పందించి, నష్టాన్ని అంచనా వేసి వెంటనే పరిహారం అందించాలని వారు కోరారు.

## మానవత్వం చాటిన వైద్యుడు.

### తాగునీటి కష్టాలు తీర్చిన డాక్టర్ సంపత్ కుమార్



**తాండూరు అక్టోబర్3(జనంసాక్షి) :** పట్టణంలోని రెండో వార్డు బుడగ జంగం కాలనీ వాసుల దీర్ఘకాలిక తాగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. శ్రీ బాలాజీ నర్సింగ్ హోం ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్ కుమార్ పూర్తి సహకారంతో శనివారం కాలనీలో నూతన బోరును వేయించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ చాలా రోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. ఈ విషయాన్ని మోడెం కృష్ణ డాక్టర్ సంపత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన డాక్టర్ వెంటనే బోరు వేసేందుకు ఆర్థిక సహాయం అందించార ని తెలిపారు. తాగునీటి సమస్య తీరడంతో బుడగ జంగం కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ డాక్టర్ సంపత్ కుమార్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ప్రజా సంఘం తాండూరు డివిజన్ కార్యదర్శి బుడగ జంగం వెంకటేష్, సీనియర్ రిపోర్టర్ లక్ష్మణ్, వార్డు కౌన్సిలర్ రమేష్, బుడగ జంగం మోడెం కృష్ణ, మోడెం దత్తు, మోడేం రమేష్, రుద్రాక్షల దస్తప్ప, రుద్రాక్షల బాబు, వాన రాసి శేఖర్, శాంతి కుమార్, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.

## తాండూరు మున్సిపాలిటీలో ఎమ్మెల్యే బీఎంఆర్ తక్షణ స్పందన

### వార్డు నం.2లో డ్రైనేజీ పనులు ప్రారంభం.



**తాండూరు (జనంసాక్షి) :** తాండూరు మున్సిపల్ పరిధిలో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తక్షణ స్పందన చూపుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో భాగంగా వార్డు నంబర్-2లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను స్థానిక కౌన్సిలర్ ప్రత్యూష మెహన్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎంఆర్ మాట్లాడుతూ వార్డులో ఉన్న డ్రైనేజీ సమస్యను నా దృష్టికి తీసుకురావడం జరిగింది. ప్రజలు ఇబ్బందులు పడకూడదు. వెంటనే ఈ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. రెండు రోజుల క్రితం ఇచ్చిన హామీ నేడు కార్యరూపం దాల్చింది. ఎమ్మెల్యే బీఎంఆర్ ఆదేశాలతో శనివారం మున్సిపల్ చైర్మన్ నీరజ్ బాల్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ ప్రత్యూష మెహన్ తో కలిసి వార్డు నంబర్-2లో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, తక్షణమే స్పందించి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బీఎంఆర్‌కి, మున్సిపల్ చైర్మన్‌కు, కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# చట్ట ప్రకారమే భూమి కొనుగోలు



- పంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- పట్టా భూమిలో చొరబడి పంట ధ్వంసం
- కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ దౌర్జన్యం.. - బాధిత రైతు ఓరుగంటి దొరస్వామి నాయుడు ఆవేదన

రంగారెడ్డి, అక్టోబర్ 3 (జనంసాక్షి) రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడు గ్రామంలోని సర్వే నంబర్ 150లో గల 5 ఎకరాల పట్టా భూమిని తాను చట్టప్రకారమే కొనుగోలు చేశానని, తన భూమిలోకి అక్రమంగా ప్రవేశించి పంటను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు ఓరుగంటి దొరస్వామి నాయుడు డిమాండ్ చేశారు. శనివారం కప్పపాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కప్పపహాడు గ్రామానికి చెందిన సదరు భూమిని 2001లో కృష్ణారావు అనే వ్యక్తి ఏజీపీఏ చేసుకుని, రక్షిత కౌలుదారులు, కబ్జాలో ఉన్న రైతులందరికీ డబ్బులు చెల్లించి సబ్-ఇన్స్పెక్టర్/సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో నరసింహారెడ్డి పేరిట చట్టబద్ధంగా కొనుగోలు చేశారని తెలిపారు. ఆ తర్వాత 2019లో తాను ఆ ఐదు ఎకరాల భూమిని కొనుగోలు చేసి, నాటి నుంచి నేటి వరకు సక్రమంగా సాగు చేసుకుంటున్నానని స్పష్టం చేశారు. కాగా సదరు భూమిలో ఈ ఏడాది 'పామ్ ఆయిల్' (జామ్ ఆయిల్) తోటను సాగు చేసినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన జంగిలి దేవదాస్, ప్రభాకర్, నరసింహ సహా మరికొంత మంది అర్ధరాత్రి వేళ అక్రమంగా ప్రవేశించి తోటను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పొలంలో వేసిన కడీలను సైతం విరగొట్టి దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆయన వాపోయారు. ఇదే భూమికి సంబంధించి గతంలో కోర్టుకు వెళ్లగా, తాను చట్టపరంగా కొనుగోలు చేసిన అన్ని ధృవీకరణ పత్రాలను కోర్టులో సమర్పించి అనుకూలంగా 2021లో కోర్టు స్టే తెచ్చుకున్నామని దొరస్వామి నాయుడు తెలిపారు. న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను సైతం లెక్కచేయకుండా, కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా తన భూమిలోకి ప్రవేశించి నష్టం కలిగించారని తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, ప్రశాంతంగా సాగు చేసుకుంటున్న తనపై దాడి చేసి పంటను నాశనం చేసిన వ్యక్తులపై ప్రభుత్వం, పోలీసులు స్పందించి తక్షణమే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

### మాజీ జడ్పీటీసీ మధుకర్



**మర్పల్లి అక్టోబర్ 03 (జనంసాక్షి)** అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రుడు హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మాజీ జడ్పీటీసీ మధుకర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ఎంసీఏ ఫంక్షన్ హాల్‌లో బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పట్టభద్రుల ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి మధుకర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ త్వరలో హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను పట్టభద్రుల ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా నమోదుకు ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సాధారణంగా సంబంధిత అర్హత తేదీకి కనీసం మూడు సంవత్సరాల ముందు డిగ్రీ లేదా సమానమైన అర్హత పొందిన వారు సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసితులై ఉంటే పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో నమోదు చేసుకునే అర్హత కలిగి ఉంటారని అన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులను గుర్తించి, వారికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు పట్టభద్రుడు ఓటరు నమోదుకు దూరం కాకుండా గ్రామాల వారీగా ప్రత్యేక దృష్టి సారించాలని నాయకులకు సూచించారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన ఎన్నికలని గత మూడేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పాలన, అమలు చేసిన హామీలు, ప్రజలకు ఇచ్చిన హామీలపై పట్టభద్రులు తమ అభిప్రాయాన్ని ఓటు ద్వారా తెలియజేసే అవకాశం ఉందన్నారు పట్టభద్రుల ఓటు ఒక బాధ్యత. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ముందుగా ఓటరుగా నమోదు చేసుకుని, ఎన్నికల సమయంలో తమ అభిప్రాయాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో తెలియజేయాలి. ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులందరి ఓటరు నమోదు జరిగేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలి" అని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, బట్టు రమేష్, రమేష్, మాజీ యూత్ అధ్యక్షులు మధుకర్, మాజీ కో అప్షన్ సోహైల్, నాయబ్ గౌడ్, మాజీ సర్పంచ్ జైపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, పాండు, పిర్యా నాయక్, షఫీ, మోహన్, సోషల్ మీడియా వికాస్, చంటి, ఆనంతి, బాలేష్, వీరేశం గౌడ్, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## అనంతగిరి ఘాట్ బస్సు ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే.



తాండూరు ఆక్టోబర్ 3(జనంసాక్షి) : వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేటు బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన జిల్లాను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తో కలిసి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అనంతగిరి ఘాట్ రోడ్డులో జరిగిన బస్సు ప్రమాదం అత్యంత విషాదకరం. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఘాట్ రోడ్డులో భద్రతా చర్యలు చేపడతామని తెలిపారు.ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని అన్నారు.అనంతరం ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రి, ఎమ్మెల్యే పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం, క్షతగాత్రులకు రూ. లక్ష చొప్పున సాయం అందిస్తామని మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు.

## శ్రీ మణికంఠ రెసిడెన్సీ ఓనర్స్ అసోసియేషన్‌కు నూతన కమిటీ

### అధ్యక్షులుగా రావి సుకుమార్ ఎన్నిక

**బోడుప్పల్-జనంసాక్షి :** మేడిపల్లి డివిజన్ ధరణి కాలనీ పరిధిలోని శ్రీ మణికంఠ రెసిడెన్సీ ఓనర్స్ అసోసియే షన్‌కు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షుడిగా రావి సుకుమార్ ఎన్నికయ్యా రు. అధ్యక్షుడు రావి సుకుమార్ ఆధ్వర్యం లో మిగిలిన కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసి నూతన కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ట్మె ంట్ అభివృద్ధి,సభ్యుల సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ,భద్రతా చర్యల బలోపేతం, మౌలిక వసతుల మెరుగుదల కోసం నూతన కమిటీ సమష్టిగా పనిచేస్తుం దని తెలిపారు.అసోసియేషన్ సభ్యులందరి సహకారంతో శ్రీ మణికంఠ రెసిడెన్సీని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా సభ్యులు అధ్యక్షుడు రావి సుకుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## అందుబాటులో శనగ విత్తనాలు



### మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర

షాబాద్, అక్టోబర్ 3(జనం సాక్షి); యాసంగి సీజన్ కు సంబంధించి ప్రభుత్వం శనగ విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందిస్తుందని మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర పేర్కొన్నారు. మిషన్ ఫర్ ఆత్మనిర్భర్త ఇన్ పల్సెస్ (యం.ఏ. ఎన్.పి)-2026-27 యాసంగి సీజన్ కోసం ఎన్బిఈజి-452 రకం శనగ విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విత్తనాలు కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ లను మీ క్లస్టర్ వ్యవసాయ అధికారికి సమర్పించి సబ్సిడీపై షాబాద్ రైతు వేదికలో విత్తనాలు పొందగలరని తెలిపారు. అలాగే యాసంగిలో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఎల్ నినో బలపడే అవకాశం ఉన్నందున సాగునీరు తక్కువగా ఉన్నచోట వరిపంట సాగు చేయవద్దని, బదులుగా ఆరుతడి పంటలు తక్కువ నీటితో పండించే కుసుమ, శనగ, జొన్న, నువ్వులు మరియు ఇతర కూరగాయల పంటలను నీటి లభ్యతకు అనుగుణంగా సరైన పంటను ఎన్నుకొని సాగు చేసుకోవాలని తెలియజేశారు.

## ఐటీ కార్మిక విభాగం రాష్ట్ర కో-కన్వీనర్‌గా సాంబమూర్తి గోదాసు



**ఎల్బీనగర్, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్మిక విభాగంలోని ఐటీ కార్మిక విభాగం రాష్ట్ర కో-కన్వీనర్‌గా సాంబమూర్తి గోదాసు నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయం లో రాష్ట్ర కార్మిక విభాగం కన్వీనర్ అందె శ్రీనివాస్ చేతుల మీదుగా సాంబమూర్తి గోదాసు నియామక పత్రాన్ని అందుకున్నా రు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ ఐటీ రంగంలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఐటీ కార్మికుల హక్కుల పరిరక్షణకు పాటుపడుతూ, వారి సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో-కన్వీనర్ ఆకుల శ్రీనివాస్, సూర్యాపేట లేబర్ సెల్ ఇన్‌చార్జి పాలకుర్తి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 3( జనం సాక్షి) :** సీఎంసీ దుండిగల్ సర్కిల్ 59 పరిధి భౌరంపేట్ లక్ష్మీ నగర్ కాలనీలో విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించేందుకు నూతనంగా నాలుగు నాలుగు ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయగా, మాజీ కౌన్సిలర్ మురళీ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ట్రాన్స్ఫార్మర్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ విచ్చేసి ట్రాన్స్ఫార్మర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ద్వారా అభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని, గత 12 ఏళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పాటు దుండిగల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ ప్రసూన, పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, ధర్మా రెడ్డి, కాలనీ వాసులు తిరుపతి రెడ్డి, దిలీప్, సూరిబాబు, శ్రీనివాస్ రెడ్డి, చారి పాల్గొన్నారు.

## శామీర్‌పేట డివిజన్ ఎస్సీ అధ్యక్షుడిగా సందని ఆనంద్ నియామకం



**శామీర్‌పేట, అక్టోబర్ 03 (జనం సాక్షి) :** శామీర్‌పేట-300 డివిజన్ ఎస్సీ అధ్యక్షుడిగా బాబాగూడకు చెందిన సందని ఆనంద్ నియామకం అయ్యారు. కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా ఆనంద్ నియామక పత్రం అందు కున్నారు. శనివారం శామీర్‌పేటలోని ఉమ్మడి శామీర్‌పేట మండలం ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. తనపై నమ్మకంతో ఈ భాద్యత అప్పగించినందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. శామీర్‌పేట డివిజన్ లో అందరి సహకారంతో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ కావలి చంద్రయ్య, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు నక్క సందీప్ గౌడ్, జిల్లా ఆర్టిఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, పలువురు నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఆర్టిఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, శామీర్‌పేట మండల మాజీ అధ్యక్షుడు వై.శంకర్ గౌడ్, నాయకులు వంగ నరసింహారెడ్డి, భరత్ కుమార్, కత్తి రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఘ్యారమీ పండుగ శుభాకాంక్షలు

ఖమ్మం (జనంసాక్షి) : 8వ డివిజన్‌లో ఘ్యారమీ పండుగను పురస్కరించుకుని బీఆర్ఎస్ నాయకుడు భూక్యా అశోక్ ముస్లిం సోదర సోదరీమణులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘ్యారమీ పండుగ ప్రతి కుటుంబంలో శాంతి, సంతోషం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షించారు. మతాలు వేరైనా ప్రజలంతా ఐకమత్యంతో, సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని అన్నారు. 8వ డివిజన్‌లో మత సామరస్యం, సోదరభావం కొనసాగడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల మధ్య ఐక్యతే ప్రాంత అభివృద్ధికి బలమని భూక్యా అశోక్ అన్నారు.



## ఇందిరమ్మ ఇంటి కల సాకారం

**లబ్ధిదారుడు ఈద భాస్కర్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు**



కీసర, అక్టోబర్ 03 (జనంసాక్షి) : ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాల ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావు పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సురకంటి శ్రీకాంత్ రెడ్డి, దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావులు శనివారం 13వ వార్డులోని ఇందిరమ్మ కాలనీలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు ఈద భాస్కర్ కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపి, బట్టలు బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాల ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని పేర్కొన్నారు. లబ్ధిదారుడు ఈద భాస్కర్ కుటుంబ సభ్యులతో ముచ్చటించి వారి సంక్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు.

## బీసీ బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



శంషాబాద్, సెప్టెంబర్3(జనంసాక్షి) : శంషాబాద్ గొల్లపల్లిలో జరగనున్న బీసీ బహిరంగ సభ ఏర్పాట్లను టీపీసీసీ ఓబీసీ చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి నార్సింగి డిజైన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్ పరిశీలించారు. సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సాయిరాం ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తల్లి ఇద్దరు పిల్లలతో బావిలో దూకి ఆత్మహత్య

**కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణం**

**మృతురాలి తండ్రి హనుమయ్య పోలీసులకు ఫిర్యాదు**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న చన్గోముల్ పోలీసులు**



వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 3 (జనం సాక్షి):కుటుంబ కలహాల నేపథ్యంలో మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటనచెన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమనుగుర్తి గ్రామ శివారులో సంఘటన చోటుచేసుకుంది.పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, మంచన్ పల్లి గ్రామపంచాయతీ మాటుగూడ గ్రామానికి చెందిన ఉప్పరి మమత ఏలియాస్ పద్మమ్మ, వయస్సు (30) తన భర్త ఉప్పరి రాజుతో కలిసి నివసిస్తోంది. వీరికి ఇద్దరు పిల్లలు, ఉప్పరి సాకేత్( 8) ఉప్పరి జనశ్రీ( 4) సంవత్సరాలు ఉన్నారు. శుక్రవారం ఉదయం మమత తన ఇద్దరు పిల్లలను వెంట తీసుకుని ఇంటి నుండి బయటకు వెళ్లింది. అనంతరం ఆమె తన తండ్రి ఇంటికి వెళ్లలేదని తెలియడంతో కుటుంబ సభ్యులు బంధువులు ఆమె కోసం గాలించారు.ఈ క్రమంలో సోమనుగుర్తి గ్రామంలోని వ్యవసాయ పొలం వద్ద ఉన్న బావి గట్టుపై పిల్లల చెప్పులు ఒక హ్యాండ్‌బ్యాగ్ కనిపించాయి.అనుమానం రావడంతో స్థానికుల సహాయంతో బావిలో గాలించగా మమత మరియు ఆమె ఇద్దరు పిల్లల మృతదేహాలు బావిలో లభించాయి.ఈ ఘటనపై మృతురాలి తండ్రి బేగరి హన్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చెన్గోముల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించబడింది.మృతురాలి కుటుంబ సభ్యుల వాంగ్మూలం





ప్రకారం, మమత ఆమె భర్త మధ్య గతంలో కుటుంబ కలహాలు జరిగినట్లు, ఈ విషయమై గతంలో మహిళా పోలీస్ స్టేషన్, వికారాబాద్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే, భర్త ఉప్పరి రాజు కారణంగానే ఈ ఘటన జరిగిందా లేదా అనే అంశాన్ని పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.ఘటనకు సంబంధించి సంఘటనా స్థల పరిశీలన, మృతదేహాల పోస్టుమార్టం, కుటుంబ సభ్యుల సాక్షుల వాంగ్మూలాల నమోదు, గతంలో ఇచ్చిన ఫిర్యాదుల పరిశీలన ఇతర సంబంధిత ఆధారాల సేకరణ కొనసాగుతున్నాయి.దర్యాప్తులో లభించే ఆధారాలు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా బాధ్యులపై చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి.ప్రజలు ఈ ఘటనకు సంబంధించి నిర్ధారణ కాని సమాచారాన్ని ప్రచారం చేయకుండా, పోలీసులకు సహకరించాలని కోరారు. శవాలకు పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

## వీధి కుక్కల స్వైరవిహారం.. ప్రజల్లో భయాందోళన



కొడంగల్, అక్టోబర్ 3 (జనం సాక్షి) : కొడంగల్ పట్టణంలో వీధి కుక్కల స్వైరవిహారం రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, రెండో వార్డు మాజీ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్ అన్నారు.పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలనీలు, పాఠశాలల పరిసరాల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయని తెలిపారు. దీంతో చిన్నారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.వీధి కుక్కల నియంత్రణకు మున్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి, ప్రజలకు భద్రత కల్పించాలని మధుసూదన్ యాదవ్ కోరారు.

# ఎంఎంసీ స్టాండింగ్ కమిటీలో అభివృద్ధి ప్రతిపాదనల జోరు

**చెరువుల పునరుద్ధరణకు రూ.60 కోట్లు**

**రోడ్ల అభివృద్ధికి రూ.97.5 కోట్ల ప్రతిపాదన**

**డ్రైనేజీ, పారిశుధ్యం, పర్యావరణంపై ప్రత్యేక దృష్టి**




మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 03 (జనంసాక్షి)

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) స్టాండింగ్ కమిటీ 8వ సాధారణ సమావేశంలో నగర మౌలిక వసతుల కల్పన, చెరువుల పునరుద్ధరణ, డ్రైనేజీ అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కీలక ప్రతిపాదనలను పరిశీలించారు. పట్టణాభివృద్ధి పనులను వేగవంతం చేసే దిశగా పలు అంశాలపై చర్చించారు. తార్నాకలోని ఎంఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ, స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ 8వ సాధారణ సమావేశం నిర్వహించారు. నగర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను సమావేశంలో పరిశీలించారు. కుంట్లూర్ పెద్ద చెరువు నుంచి పసుమాముల చెరువు వరకు డ్రైనేజీ వ్యవస్థ పునర్నిర్మాణం, కొత్త డ్రైన్ల నిర్మాణం, నాలా అభివృద్ధి ప్రణాళిక (ఎస్‌డీపీ), భూసేకరణ అంశాలను పరిశీలించారు. అలాగే ఎస్ఎన్‌డీపీ ఫేజ్-2 కింద నాసిన్ చెరువు నుంచి కొమటివాని కుంట వరకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ ప్రతిపాదనపై చర్చించారు. బోడుప్పల్ సర్కిల్‌లోని చింతల్ చెరువు పునరుద్ధరణకు రూ.20 కోట్లు, ఘట్‌కేసర్ సర్కిల్‌లోని రాంపల్లి చెరువు అభివృద్ధికి రూ.40 కోట్ల పరిపాలనా అనుమతులకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించారు. నాగారం డివిజన్‌లో వ్యర్థాల నిర్వహణ కేంద్రాల కోసం రూ.4.95 కోట్లతో కాంపౌండ్ వాల్ నిర్మాణం, రూ.2.95 కోట్లతో యూజీడీ నిర్మాణ పనుల ప్రతిపాదనలను కమిటీ ముందుంచారు. కార్పొరేషన్ పరిధిలో బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీ (బీఎంసీ) ఏర్పాటు, పీపుల్స్ బయోడైవర్సిటీ రిజిస్టర్ తయారీ అంశాలను కూడా పరిశీలించారు. సైనిక్‌పురిలో రూ.2.85 కోట్లతో డాగ్ పార్క్ అభివృద్ధి, బండ్లబావిలో మల్టీపర్పస్ అవుట్‌డోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించారు. పటేల్‌నగర్ ఎస్‌టీపీ నుంచి డి-మార్ట్ వరకు 36 మీటర్ల వెడల్పుతో రహదారి విస్తరణ, నిర్మాణ పనులకు హెచ్-సిటీ నిధుల కింద రూ.97.50 కోట్ల పరిపాలనా అనుమతి ప్రతిపాదనను కూడా సమావేశం పరిశీలించింది. ఫతుల్లాగూడ సీ అండ్ డీ ప్రాసెసింగ్ ఫెసిలిటీ, పెట్ పార్క్ పైలట్ ప్రాజెక్టు, కంట్రోల్ రూమ్ నిర్వహణ, ఈపీఎఫ్‌వో వేతన పరిమితి సవరణ, ప్రభుత్వ భూముల కేటాయింపు, న్యాయ విభాగ నియామకాలు తదితర అంశాలపై కూడా కమిటీ చర్చించింది. ఈ సమావేశంలో ఎంఎంసీ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్, జోనల్ కమిషనర్లు శ్రుంచిత్ గంగ్వార్, ఐఏఎస్, వికాస్ మహతోఐఏఎస్, అదనపు కమిషనర్లు రఘు ప్రసాద్, వేణుగోపాల్, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, సెక్రటరీ రజినీ, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ సునంద, సూపరింటెండింగ్ ఇంజనీర్లు రమేష్ బాబు, నాగేందర్, రోహిణి, ఎల్ ఏ ఓ. సరిత, చీఫ్ ఫైనాన్షియల్ అడ్వైజర్ వెంకటేశ్వర రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మాధవి లత, రవీందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# పోషకాహారంతో తల్లీబిడ్డలకు ఆరోగ్యం





**అల్వాల్, అక్టోబర్ 3 (జనంసాక్షి):** తల్లులు, చిన్నారుల ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో కీలకమని సీడీపీఓ స్వాతి సూచించారు. పోషణ మాసం సందర్భంగా అల్వాల్ సెక్టార్ యాదమ్మనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ సుధాకీర్తి సూచనల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, టీహెచ్ఆర్ పిల్లల తల్లులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణలో పురుషుల భాగస్వామ్యం, పోషకాహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తయారు చేసుకునే విధానాలను సీడీపీఓ స్వాతి, సూపర్‌వైజర్ సుధాకీర్తి వివరించారు. తల్లులు, పిల్లలు పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

# ఓబిసి సింహ గర్జనను విజయవంతం చేయండి

## జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగురింత పారిజాత నరసింహారెడ్డి



**రంగారెడ్డి, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపుమేరకు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం గొల్లపల్లిలో నిర్వహించనున్న ఓబిసి సింహ గర్జన కార్యక్రమాన్ని ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త హాజరై సంఘీభావాన్ని తెలపడం ద్వారా దిగ్విజయం చేయాల్సిన అవసరం ఉందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు చిగురింత పారిజాతా నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆమె పలు విషయాలను వెల్లడిస్తూ భారతదేశంలో సామాజిక సమతుల్యతను, బహుజన్ల హక్కులను కాపాడటమే లక్ష్యంగా భారత జాతీయ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గొప్ప లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని ఇందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీలో బిసి ల ప్రాతినిథ్యానికి తగిన ప్రాధాన్యతను కల్పించడంలో భాగంగా ఒబిసిల చైతన్యంకోసం పలు కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. షాద్ నగర్ ఎమ్మెల్యే పిసిసి రాష్ట్ర ఓబిసి సెల్ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ సింహగర్జన కార్యక్రమంలో ఓబిసి హక్కుల కోసం, రాజ్యాంగబద్ధమైన పదవుల కోసం, నిన్న రిజర్వేషన్ల సాధన కోసం దామాషా ప్రకారం వారికి దక్కాల్సిన ఫలాలు తప్పకుండా అంది తీరాల్సిందే నాన్న ప్రధాన నినాదంతో ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త హాజరై సభను విజయవంతం చేయాలని ఆమె కోరారు. నేడు జరగనున్న సింహగర్జన కార్యక్రమానికి జాతీయ ఓబీసీ సెల్ చైర్మన్ అనిల్ జైహింద్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని, రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐపిసి చైర్మన్ మధుయాష్కి గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఏఐసిసి ఓబిసి, ఎస్సీ ఎస్టీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అన్ని జిల్లాల ప్రముఖ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు ఈ సమావేశానికి హాజరుకానున్నందున ప్రతి ఒక్కరు కదలి రావాలని చిగురింత పారిజాత నరసింహారెడ్డి కోరారు.

# ఘనంగా ప్రారంభమైన న్యూరోవాస్కాన్-2026





**ముషీరాబాద్, అక్టోబర్ 3 (జనం సాక్షి) :** న్యూరోవాస్కులర్ వైద్యరంగంలో ఆధునిక చికిత్సా విధానాలు, సాంకేతికత, పరిశోధనలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న న్యూరోవాస్కాన్-2026 సదస్సు రామోజీ ఫిల్మ్‌సిటీలో ఘనంగా ప్రారంభమైంది. రెనోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ సైన్సెస్ (RINS), పాన్ రీసెర్చ్ ఫౌండేషన్, సెరెబ్రోవాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా (CVSI) సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 2 నుంచి 4 వరకు సదస్సు కొనసాగుతోంది. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి 400 మందికి పైగా న్యూరో నిపుణులు హాజరైన ఈ సదస్సులో న్యూరోవాస్కులర్ సర్జరీ, ఎండోవాస్కులర్ చికిత్సలు, స్ట్రోక్ నివారణ, న్యూరో ఇమేజింగ్ తదితర అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. తొలిరోజు మైక్రోసర్జికల్, ఎండోవాస్కులర్ టెక్నిక్స్‌పై హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్ నిర్వహించారు. శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి రామచంద్రు తేజావత్, గౌరవ అతిథిగా రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, సీఈఓ శ్రీధర్ పెద్దిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తేజావత్ మాట్లాడుతూ వైద్యరంగంలో సాంకేతికత, పరిశోధనలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, ప్రపంచస్థాయి నిపుణులు ఒకే వేదికపై చర్చించడం అభినందనీయమన్నారు. =×చీఫ్ సీనియర్ న్యూరోసర్జన్లు, సదస్సు నిర్వహణ కార్యదర్శులు డాక్టర్ సయ్యద్ అమీర్ బాషా పస్పాల, డాక్టర్ టీ.వి. రామకృష్ణమూర్తి మాట్లాడుతూ ఆధునిక చికిత్సా విధానాలపై నిపుణుల చర్చలు వైద్యులు, పరిశోధకులకు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. సదస్సు మిగిలిన రోజుల్లో ప్లీనరీ సెషన్లు, సింపోజియాలు, ప్యానెల్ చర్చలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**అల్వాల్, అక్టోబర్ 3 (జనంసాక్షి) :** సికింద్రాబాద్‌లోని లయోలా అకాడమీ డిగ్రీ, పీజీ కళాశాల బీకామ్ డిజిటల్ మార్కెటింగ్ విభాగం ఆధ్వర్యంలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 'రీకనెక్ట్--రీలైవ్--రీఇమాజిన్' ఇతివృత్తంతో జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రస్తుత విద్యార్థులు పాల్గొని కళాశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కెరీర్ అనుభవాలు, పరిశ్రమలోని అవకాశాలు, వృత్తిపరమైన అంశాలపై పరస్పరం చర్చించుకున్నారు. విభాగాధిపతి వై. అంజనీ కుమారి, అధ్యాపకులు శ్రీవత్స జి., పి. బాల ప్రవీణ్, ఆర్. శ్రీనివాసరావు, హేమాదేవి పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ రెవ. ఫాదర్ డాక్టర్ ఎన్.బి. బాబు ఎస్‌జే, కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ రెక్స్ ఏంజెలో, వైస్ ప్రిన్సిపాల్ రెవ. ఫాదర్ కె. అనిల్‌కుమార్, యాజమాన్య సభ్యులు సహకరించారు.



# 10వ వార్డుకు నిరంతర విద్యుత్ వెలుగులు

## రెండు 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, 24 గంటల విద్యుత్ సరఫరా ప్రారంభం

**చేవెళ్ల, అక్టోబర్ 03 (జనంసాక్షి)** చేవెళ్ల మున్సిపల్ 10వ వార్డులో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. శనివారం స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు నడిమెల్ల లావణ్య శంకర్, వార్డు కౌన్సిలర్ పెద్దోళ్ల దయాకర్‌తో కలిసి రెండు 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను, 24 గంటల విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. వార్డు ప్రజలు విద్యుత్ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కరెంటు కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బండారి శైలజ ఆగిరెడ్డి, మద్దెల శ్రీనివాస్, మూడవత్ కృష్ణ నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పడాల ప్రభాకర్, టేకులపల్లి శ్రీనివాస్, నడిమోల మహేందర్, మాజీ డైరెక్టర్ బుర్ల మహేష్, విద్యుత్ అధికారులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ నుంచి బక్కని రవిని తొలగిస్తున్నాం

## ఎమ్మెస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు మాదిగ



**మహేశ్వరం,అక్టోబర్ 3(జనంసాక్షి):** బక్కని రవి ఎమ్మార్పీఎస్ పేరును ఉపయోగిస్తూ చేస్తున్న ప్రకటనలకు,కార్యక్రమాలకు, ప్రచారాలకు ఎమ్మార్పీఎస్ కు ఎలాంటి సంబంధం లేదని,బక్కని రవిని ఎమ్మార్పీఎస్ నుంచి తొలగిస్తున్నామని ఎమ్మెస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు మాదిగ శనివారం మహేశ్వరం మండల కేంద్రంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ పేరును అడ్డు పెట్టుకొని వ్యక్తిగత రాజకీయాలు,స్వప్రయోజనాలు నడపాలని చూస్తే సహించేది లేదన్నారు.బక్కని రవికి ఎమ్మార్పీఎస్ తో ఎలాంటి సంబంధం,అధికారిక సంబంధం లేదన్నారు. బక్కని రవి ఎమ్మార్పీఎస్ పేరును దుర్వినియోగం చేస్తే నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ సీనియర్ నాయకుడు ఎర్ర కృష్ణ మాదిగ,మాజీ మండల అధ్యక్షులు జంగయ్య మాదిగ ఎర్ర గణేష్ మాదిగ,సీనియర్ నాయకుడు ఎర్ర నవీన్ కుమార్ మాదిగ,మండల అధ్యక్షుడు బొల్లిపాక ప్రభాకర్ మాదిగ,అధికార ప్రతినిధి కొండని కుమార్ మాదిగ,ఉపాధ్యక్షులు భూషణగారి శేఖర్ మాదిగ,మంద మహేష్ మాదిగ,పెండ్యాల వంశీ మాదిగ,అర్జున్ మాదిగ,పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సేవా సంకల్పంతో విద్యార్థులకు చేయూత



**అల్వాల్, అక్టోబర్ 3 (జనంసాక్షి):** విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూతనందించే లక్ష్యంతో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం తుర్కపల్లిలోని ఎం.పి.పి.ఎస్ ప్రభుత్వ పాఠశాలలో సేవా సంకల్ప అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు, పాఠశాలకు కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శేఖర్ యాదవ్, ఐటీ సెల్ కన్వీనర్ కరుణ శ్రీతో పాటు పలువురు పాల్గొన్నారు. పాఠశాల అవసరాలకు సహకరిస్తామని శేఖర్ యాదవ్ తెలిపారు.



# నేడు జరిగే సింహ గర్జనకు తరలి రండి

**మండల,మున్సిపల్ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి, మడపతి చంద్రమౌళి**

**శంకర్ పల్లి, అక్టోబర్ 3(జనం సాక్షి) :** ఓబీసీల హక్కులు సామాజిక న్యాయం తగిన ప్రాతినిధ్యం వంటి అంశాలపై చర్చించేందుకు ఈనెల 4వ తేదీన శంషాబాద్ లో నిర్వహించిన ఓబీసీ సింహ గర్జనకు పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని శంకరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి,మున్సిపల్ అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి లు పిలుపునిచ్చారు.శంకర్ పల్లి లో వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ శంషాబాద్ మండలం గొల్లపల్లిలో నిర్వహించనున్న ఓబీసీ సింహ గర్జన మహాసభకు వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తరలిరావాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఓబీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిస్కీ జిత్ని సంఖ్య -ఉత్నీ ఇసేదార్ అనే నినాదంతో నిర్వహించనున్న ఈ మహాసభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసిసి ఓబీసీ చైర్మన్ అనిల్ అనిల్ జైహింద్ యాదవ్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసిసి చైర్మన్ మధుయాస్ కి గౌడ్, ప్రభుత్వ సలహాదారు వి హనుమంతరావు, ఎస్సీ, ఎస్ టి కోఆర్డినేటర్ కొప్పుల రాజు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

# కోర్టు ఉత్తర్వుల మేరకే భూ రిజిస్ట్రేషన్ తహసీల్దార్ అయ్యప్ప



**యాచారం, అక్టోబర్ 3(జనం సాక్షి ) :** యాచారం మండలం నందివనపర్తి గ్రామంలోని భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారంటూ వచ్చిన వార్త కేవలం అసత్యమని, న్యాయస్థానాల ఆదేశాల మేరకే పూర్తి చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని యాచారం మండల తహసీల్దార్ అయ్యప్ప ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ --- నందివనపర్తి గ్రామంలోని సర్వే నంబర్ 361/ఎఎ, ఖాతా నంబర్ 155లోని 5 ఎకరాల 11 గుంటల భూమికి సంబంధించి ఓ.ఎస్. నంబర్ 547/2021 కేసులో ఇబ్రహీంపట్నం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 26-07-2022న విక్రయ పత్రం అమలు చేయాలని తీర్పు ఇచ్చిందన్నారు. అనంతరం పిటిషనర్ వేసిన జ్యూ. చీఫ్. 18/2023 ప్రక్రియలో భాగంగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జారీ చేసిన లేఖలు (ఇఅం. చీఫ్. 167/2025, 168/2025) ప్రకారం కోర్టు రికార్డ్ అసిస్టెంట్ ద్వారా సేల్ డీడ్ నమోదుకు ప్రతిపాదించగా, దీని అమలుపై తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్ నంబర్ 35037/2025లో 19-11-2025న హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. న్యాయస్థానం ఆదేశించిన నిబంధనలు మరియు స్లాట్ బుకింగ్ ఆధారంగానే రిజిస్ట్రేషన్ అధికారి సదరు సేల్ డీడ్‌ను నమోదు చేసి విడుదల చేశారని, ఇందులో తహసీల్దార్ గానీ, రెవెన్యూ సిబ్బంది గానీ రికార్డులను తారుమారు చేయలేదని తెలిపారు. వాస్తవాలను తెలుసుకోకుండా పోలీసులు ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడం సరి కాదని అన్నారు.

# తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఇమ్మడి సతీష్‌కు ఘన సన్మానం





**షేక్‌పేట (జనంసాక్షి) :** తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ (TDF) ఆధ్వర్యంలో తెలంగాణ యువత రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఇమ్మడి సతీష్‌కు ఘన సన్మానం నిర్వహించారు. ఇటీవల డాక్టరేట్ అందుకున్న డాక్టర్ ఇమ్మడి సతీష్‌ను తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు అభినందించారు. గత కొన్ని సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాల్లో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలకు, యువతకు తనవంతు సేవలను అందిస్తున్న ఆయనకు డాక్టరేట్ లభించడం సంతోషకరమైన విషయమని ఇణిఖీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, యువతకు తెలంగాణ యువత ద్వారా డాక్టర్ ఇమ్మడి సతీష్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. సామాజిక సేవలతో పాటు విద్యార్థులు, పారిశ్రామిక రంగం, సినిమా రంగం, వివిధ వర్గాల ప్రజలతో కలిసి పనిచేస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. డాక్టర్ ఇమ్మడి సతీష్ మరిన్ని అవార్డులు, పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలకు సంబంధించిన ఏ సమస్య వచ్చినా తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ తరఫున తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటామని డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ (TDF) ప్రముఖులు డాక్టర్ ప్రదీప్ వజ్జా, న్యాయ విభాగం అధిపతి మరియు రాష్ట్ర కోశాధికారి; డాక్టర్ అన్వేష్, తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు; డాక్టర్ బాల గణేష్ వేదాటి, సంయుక్త కార్యదర్శి; డాక్టర్ నిఖిల్ కుమార్ చొక్కం, వర్కింగ్ ప్రెసిడెంట్; డాక్టర్ నిఖిల్, అకాడమీ చైర్మన్; డాక్టర్ చేతన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు ఆదేశాల మేరకే భూ రిజిస్ట్రేషన్ జరిపించుకున్నాం

**అధికారులపై కేసులు పెట్టడం సరికాదు: బాధితులు మహమ్మద్ హైమద్, ఎండి ఖలీల్ సిద్దిక్**



**యాచారం, అక్టోబర్ 3(జనం సాక్షి ) :** నందివనపర్తి గ్రామంలోని సర్వే నంబర్ 361/ఆాలోని 5 ఎకరాల 11 గుంటల భూమికి సంబంధించి కోర్టు ఆదేశాల మేరకే చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని కొనుగోలుదారులు మహమ్మద్ హైమద్, ఎండి ఖలీల్ సిద్దిక్ స్పష్టం చేశారు. సదరు భూమిని తాము కొనుగోలు చేసినప్పటికీ, విక్రేత రిజిస్ట్రేషన్ చేయడానికి నిరాకరించడంతోనే న్యాయం కోసం కోర్టును ఆశ్రయించామని తెలిపారు. కోర్టు పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ విక్రేత స్పందించకపోవడంతో, న్యాయస్థానపు ఉత్తర్వులకు లోబడి తహసీల్దార్ ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారని వివరించారు. రిజిస్ట్రేషన్ అనంతరం ఆ భూమిని మరొకరికి విక్రయించినట్లు పేర్కొన్నారు. కోర్టు తీర్పును అంగీకరించని విక్రేత కుటుంబ సభ్యులు, నిబంధనల ప్రకారం పనిచేసిన రెవెన్యూ అధికారులపై మరియు తమపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయించడం ఎంతమాత్రం సరికాదని మండిపడ్డారు. అధికారులపై తీసుకునే చర్యల విషయంలో న్యాయస్థానమే తగిన నిర్ణయం తీసుకుంటుందని వారు వ్యాఖ్యానించారు.

# అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పోస్ట్ గ్రాడ్యుయేట్ సంఘం జిల్లా కన్వీనర్ ప్రముఖ న్యాయవాది పట్లోళ్ల అమరేందర్ రెడ్డి**



**మోమిన్ పేట అక్టోబర్ 3 (జనం సాక్షి) :** అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పోస్ట్ గ్రాడ్యుయేట్ జిల్లా కన్వీనర్ ప్రముఖ న్యాయవాది పట్లోళ్ల అమరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. నిర్వహించారు. ఈ సందర్భంగా మోమిన్ పేట మండల వైస్ ఎంపీపీ ప్రముఖ న్యాయవాది పట్టబసుల సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పట్లోళ్ల అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను పట్టభద్రుల ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా నమోదుకు ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సాధారణంగా సంబంధిత అర్హత తేదీకి కనీసం మూడు సంవత్సరాల ముందు డిగ్రీ లేదా సమానమైన అర్హత పొందిన వారు సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసితులై ఉంటే పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో నమోదు చేసుకునే అర్హత కలిగి ఉంటారని అన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులను గుర్తించి, వారికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు పట్టభద్రుడు ఓటరు నమోదుకు దూరం కాకుండా గ్రామాల వారీగా ప్రత్యేక దృష్టి సారించాలని నాయకులకు సూచించారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన ఎన్నికలని గత మూడేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పాలన, అమలు చేసిన హామీలు, ప్రజలకు ఇచ్చిన హామీలపై పట్టభద్రులు తమ అభిప్రాయాన్ని ఓటు ద్వారా తెలియజేసే అవకాశం ఉందన్నారు పట్టభద్రుల ఓటు ఒక బాధ్యత. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ముందుగా ఓటరుగా నమోదు చేసుకుని, ఎన్నికల సమయంలో తమ అభిప్రాయాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో తెలియజేయాలి. ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులందరి ఓటరు నమోదు జరిగేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలి సూచించారు

# 10వ వార్డుకు నిరంతర విద్యుత్ వెలుగులు

**రెండు 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, 24 గంటల విద్యుత్ సరఫరా ప్రారంభం**



**చేవెళ్ల, అక్టోబర్ 03 (జనంసాక్షి)** చేవెళ్ల మున్సిపల్ 10వ వార్డులో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. శనివారం స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు నడిమెల్ల లావణ్య శంకర్, వార్డు కౌన్సిలర్ పెద్దోళ్ల దయాకర్‌తో కలిసి రెండు 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను, 24 గంటల విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. వార్డు ప్రజలు విద్యుత్ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

కరెంటు కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బండారి శైలజ ఆగిరెడ్డి, మద్దెల శ్రీనివాస్, మూడవత్ కృష్ణ నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పడాల ప్రభాకర్, టేకులపల్లి శ్రీనివాస్, నడిమోల మహేందర్, మాజీ డైరెక్టర్ బుర్ర మహేష్, విద్యుత్ అధికారులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి పనిచేసే తత్వం.. మొక్కవోని ఆత్మస్థైర్యం

**కృషి.. పట్టుదల.. మొక్కవోని స్థైర్యానికి నైపుణ్యం తోడైతే అగ్నికి ఆజ్యం పోసినట్లు ఎవరికైనా తిరుగులేని విజయం... ఎక్కడికైనా ఎగబాకే నైజం... ఈ నేపథ్యంలో మొత్తానికి తరచిచూస్తే బిసిసిఐ నిర్వహిస్తున్న అండర్ 19 క్రికెట్ జట్టుకు ఎంపికనే లక్ష్యంగా కొనసాగుతున్న ప్రయత్నంలో వీను మన్కడ్ ట్రోఫీ 2026-27 సీజన్ కు సంబంధించి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తరపున రాటుదేలుతున్న ఒకే ఒక్కడు బి. వర్షిత్ రెడ్డి.**



## విపరీతమైన పోటీ ప్రపంచం.. అయినా టాలెంట్ తో రాణిస్తున్న వైనం వెరసి అండర్ 19 హైదరాబాద్ జట్టుకు ఎగబాకిన ఒకే ఒక్కడు వర్షిత్ రెడ్డి

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 03 (జనంసాక్షి) :**

**విపరీతమైన పోటీ ప్రపంచం... అయినా నమ్ముకున్న టాలెంట్ తో రాణిస్తున్న వైనం**



భారతదేశంలో మరే క్రీడకు లేనంత క్రేజ్ క్రికెట్ కు ఉందనడంలో సందేహం లేదు. మండల స్థాయి క్రీడల్లో రాణించాలంటేనే ఎంతో నైపుణ్యాన్ని కనబరిచాల్సిన నేటి తరుణంలో జిల్లాస్థాయి, ఇక రాష్ట్రస్థాయి ప్రతిభను ప్రదర్శించి జట్టుకు ఎంపిక కావాలంటే ప్రతి ఒక్కరిలో టన్నులకొద్దీ టాలెంట్ అవసరమనేది కాదనలేని నిజం. దీనికి తోడు కఠోర శ్రమతో పాటు కాసింత లక్కు రాష్ట్రస్థాయిలో చమక్కులు కురిపించి ఆయా జట్లలో ప్రాతినిధ్యాన్ని ఊహించవచ్చు. ఈ కోవలోనే వికెట్ కీపర్– బ్యాట్స్ మెన్ గా రాణిస్తున్న బి. వర్షిత్ రెడ్డి అత్యుత్తమ ప్రతిభకు తోడు కఠోర శ్రమతో హైదరాబాదులోని శేరిలింగంపల్లి లేగల క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతూ గొప్ప లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు. ఈ తరుణంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన అండర్ - 19 సూపర్ లీగ్ లో వర్షిత్ రెడ్డి అత్యుత్తమ ప్రదర్శనను కొనసాగించడం ద్వారా తనపై గొప్ప నమ్మకాన్ని క్రీడాశిక్షకులకు కలిగించాడు. టీం ఎఫ్ కు కెప్టెన్ గా వ్యవహరించిన వర్షిత్ రెడ్డి సూపర్ లీగ్ దశలో పలు మ్యాచ్లలో అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శనను, కీపింగ్ విన్యాసాలను ప్రదర్శించి సెలెక్టరుల దృష్టిని ఆకర్షించడంతోపాటు టీం ఎఫ్ వర్సెస్ టీమ్ ఏ మ్యాచ్లో కేవలం 133 బంతుల్లో 125 పరుగుల స్కోర్ ను సాధించి జట్టు విజయానికి బాటలు పరచడంతో పాటు టీం డి తో జరిగిన మ్యాచ్లో సైతం 63 బంతుల్లోనే విలువైన 44 పరుగులను జోడించి జట్టును ఆదుకున్న తీరు అద్భుతం. ఇక టీం ఈ తో జరిగిన మ్యాచ్ లో కేవలం 88 బంతుల్లోనే 101 పరుగును సాధించడం ద్వారా తాను ఎందుకు రాష్ట్రస్థాయి క్రీడాకారునిగా గుర్తింపును సాధించకూడదో తన టాలెంట్ ద్వారా క్రీడాలోకానికి సందేశాన్ని అందించాడు.

**తప్పకుండా మరో తిలక్ వర్మగా వర్షిత్ రెడ్డి :**

**కోచ్ సలాం బయాష్**

వర్షిత్ రెడ్డి ఎంతో కఠిన శ్రమ, మంచి నైపుణ్యం కలిగిన క్రికెటరే కాకుండా తనదైన శైలిలో బ్యాటింగ్ లో రాణిస్తూ కీపింగ్‌లో అద్భుతాలను సృష్టిస్తూ మంచి ప్రతిభ కలిగిన క్రికెట్ క్రీడాకారునిగా ఎదుగుతున్న తీరు చూస్తుంటే తప్పకుండా ఇతను రాష్ట్ర స్థాయి నుండి తొందరలోనే భారత జాతీయ జట్టులో స్థానాన్ని సంపాదించడంతోపాటు స్థిరంగారానిస్తూ మరో తిలక్ వర్మ గా గుర్తింపును సాధిస్తాడని వర్షిత్ రెడ్డికి క్రికెట్ కోచ్‌గా శిక్షణను అందిస్తున్న కోచ్ సలాం బయాష్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

కీపింగ్ లోను, బ్యాటింగ్ లోను రాణిస్తూ స్థిరంగా అద్భుత ప్రతిభను కనబరుస్తున్న వర్షిత్ రెడ్డి మొక్కవోని ఆత్మస్థైర్యం, క్రీడ పట్ల ఉన్న అంకితభావం ఇప్పటికే అతనికి ఎంతో గుర్తింపును అందించాయని, అయినా సరే ప్రతిరోజు ఓనమాలు నేర్చుకునే పిల్లవాడిలా క్రికెట్ క్రీడా పట్ల ఎంతో కసితో ముందుకు సాగుతూ తన శిక్షణలో రాటుదేలుతున్నాడని, ఇలాంటి క్రీడాదాహం కలిగిన వ్యక్తి భవిష్యత్తులో దేశానికి తప్పకుండా అవసరమని, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తరఫున అండర్ 19 జట్టుకు త్వరలోనే వెళ్లబోతున్నాడని, వీలైనంత తొందరగా జాతీయ జట్టులో చూడాలన్న తన ఆకాంక్షను తప్పకుండా వర్షిత్ రెడ్డి నెరవేరుస్తాడన్న భరోసాను కోచ్ బయాష్ వ్యక్తం చేశారు. కాగా అండర్ 19 జట్టుకు జరుగుతున్న ప్రాబబుల్స్ లో వర్షిత్ రెడ్డి ప్రదర్శన, ఎంపిక పట్ల ఆయన కుటుంబ సభ్యులు, కోతులు, సహచరులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తుండడం విశేషం.

# ఎమ్మార్పీఎస్ నుంచి బక్కని రవిని తొలగిస్తున్నాం

## ఎమ్మెస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు మాదిగ



**మహేశ్వరం, అక్టోబర్ 3 (జనంసాక్షి):** బక్కని రవి ఎమ్మార్పీఎస్ పేరును ఉపయోగిస్తూ చేస్తున్న ప్రకటనలకు,కార్యక్రమాలకు, ప్రచారాలకు ఎమ్మార్పీఎస్ కు ఎలాంటి సంబంధం లేదని,బక్కని రవిని ఎమ్మార్పీఎస్ నుంచి తొలగిస్తున్నామని ఎమ్మెస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు మాదిగ శనివారం మహేశ్వరం మండల కేంద్రంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ పేరును అడ్డు పెట్టుకొని వ్యక్తిగత రాజకీయాలు,స్వప్రయోజనాలు నడపాలని చూస్తే సహించేది లేదన్నారు.బక్కని రవికి ఎమ్మార్పీఎస్ తో ఎలాంటి సంబంధం,అధికారిక సంబంధం లేదన్నారు. బక్కని రవి ఎమ్మార్పీఎస్ పేరును దుర్వినియోగం చేస్తే నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ సీనియర్ నాయకుడు ఎర్ర కృష్ణ మాదిగ,మాజీ మండల అధ్యక్షులు జంగయ్య మాదిగ ఎర్ర గణేష్ మాదిగ,సీనియర్ నాయకుడు ఎర్ర నవీన్ కుమార్ మాదిగ,మండల అధ్యక్షుడు బొల్లిపాక ప్రభాకర్ మాదిగ,అధికార ప్రతినిధి కొండని కుమార్ మాదిగ,ఉపాధ్యక్షులు భూషణగారి శేఖర్ మాదిగ,మంద మహేష్ మాదిగ,పెండ్యాల వంశీ మాదిగ,అర్జున్ మాదిగ,పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సరోగసీకి 3 దరఖాస్తులకు ఆమోదం

## జిల్లా స్థాయి బోర్డు ఆమోదం

## నిబంధనల అమలులో రాజీ లేదన్న డీఎంహెచ్‌వో



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 03 (జనంసాక్షి) :** మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా స్థాయి ఏఆర్టీ,సరోగసీ బోర్డు ఐదు దరఖాస్తులను పరిశీలించి మూడింటికి ఆమోదం తెలిపింది. సరోగసీ (నియంత్రణ) చట్టం--2021 నిబంధనల మేరకు అర్హతలు, వైద్య అవసరాలు, సంబంధిత పత్రాలను పరిశీలించిన అనంతరం వైద్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ఆనంద్ తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె. ఆనంద్ అధ్యక్షతన శనివారం జరిగిన జిల్లా స్థాయి ఏఆర్టీ/సరోగసీ బోర్డు సమావేశంలో సరోగసీ దరఖాస్తులపై సమగ్ర పరిశీలన చేపట్టారు. గర్భధారణకు సంబంధించిన వైద్య సమస్యలు,



సరోగసీ అవసరం, గర్భాన్ని మోయగల సామర్థ్యం, ప్రత్యామ్నాయ చికిత్సల అవకాశాలపై నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. మొత్తం ఐదు దరఖాస్తులను పరిశీలించిన బోర్డు, చట్టబద్ధ నిబంధనలు, వైద్య ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న మూడు దరఖాస్తులకు ఆమోదం తెలిపి, ధ్రువీకరణ పత్రాలు జారీ చేసింది. సరోగసీ ప్రక్రియలో అక్రమాలు, దుర్వినియోగం, వాణిజ్య ప్రయోజనాలకు తావులేకుండా కఠినంగా వ్యవహరిస్తామని బోర్డు స్పష్టం చేసింది. అర్హత కలిగిన దంపతులకు మాత్రమే పూర్తి పరిశీలన అనంతరం అనుమతులు మంజూరు చేస్తామని డాక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. సమావేశంలో గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవీలత, శిశు వైద్య నిపుణుడు డాక్టర్ శివకిరణ్ పాల్గొన్నారు.